సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం। 2। అక్టోబర్। 2024



నేటినుంచి దసరా సెలవులు

పాఠశాలలకు విద్యా శాఖ దసరా సెలవులు ప్రకటించింది. బుధవారం నుంచి 13 వరకూ దసరా సెలవులను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 10లో ▸



ఆకట్టుకున్న నేవిగేషన్ సాఫ్ట్‌వేర్

తణుకు డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు రూపొందించిన రైల్వేస్టేషన్ నేవిగేషన్ సాఫ్ట్‌వేర్ పలువురిని ఆకట్టుకుంది. 10లో ▸



గాంధీ ఆశ్రమం వెలవెల

మండవల్లిలోని గాంధీ సేవాశ్రమం అభివృద్ధి లేక వెలవెలబోతోంది. గతంలో ఆశ్రమం పలు అభివృద్ధి కార్యక్రమాలతో కళకళలాడేది. 10లో ▸

మద్యం.. ప్రైవేటు పరం

ప్రభుత్వ మద్యం దుకాణాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసి ప్రైవేటు పరం చేసింది. కొత్త మద్యం పాలసీతో లిక్కర్ వ్యాపారాలు షురూ చేసింది. ఇందుకోసం దరఖాస్తుల స్వీకరణ మొదలుపెట్టింది. దీంతో షాపులు దక్కించుకునేందుకు నేతలు సిండికేట్లుగా జతకడుతున్నారు. షాపులు, వాటికి అనుబంధంగా బెల్టుషాపుల ఏర్పాటు, అమ్మకాలపై లెక్కలు వేసే పనిలో తలమునకలై ఉన్నారు. మరోపక్క ఎక్సైజ్ శాఖ కొత్త స్టాకులను బార్లకు తరలిస్తోంది.

ఇక సిండికేట్ల జోరు

- ప్రభుత్వ మద్యం పాలసీకి సర్కారు మంగళం
- 12వ తేదీ నుంచి ప్రైవేట్ ఆధీనంలో మద్యం దుకాణాలు
- టెండర్ల ప్రక్రియలో కూటమి నేతలు తలమునకలు
- బార్లకు తరలిపోతున్న కొత్త స్టాకు
- పట్టణాల్లో బార్లు.. గ్రామాల్లో బెల్టుషాపుల జోరు



మందుబాబులతో కిటకిటలాడుతున్న తాడేపల్లిగూడెంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్

సాక్షి, భీమవరం: టీడీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా సాగిన మద్యం అమ్మకాల కట్టడికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రైవేట్ దుకాణాలకు తెరదించింది. బెల్టుషాపులను అరికట్టి, నిర్ణీత వేళల్లో మాత్రమే మద్యం అమ్మకాలు జరిగేలా ప్రభుత్వం ఆధ్వర్యంలోనే షాపుల నిర్వహణ చేపట్టింది. అప్పటివరకు ఉన్న మద్యం దుకాణాల సంఖ్యను తగ్గిస్తూ వచ్చింది. తద్వారా గత టీడీపీ హయాంలో ఏరులై పారిన మద్యం అమ్మకాలకు చెక్ పెట్టింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం వ్యాపారాన్ని ప్రైవేటు పరం చేస్తూ కొత్త మద్యం పాలసీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 12న షాపులు దక్కించుకున్నవారు వ్యాపారం ప్రారంభించేలా దరఖాస్తుల స్వీకరణ మొదలుపెట్టింది. ఇప్పటికే కూటమి నేతలు సిండికేట్లుగా ఏర్పడి షాపులు దక్కించుకునే పనిలో తలమునకలై ఉన్నారు.

అమ్మకాలపై లెక్కలు

గతంలో జిల్లాలో భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, అత్తిలి ప్రాంతాలకు చెందిన మద్యం సిండికేట్లు బలంగా ఉన్నాయి. గత ఐదేళ్ల ప్రభుత్వ ఆధ్వర్యంలో షాపుల నిర్వహణ సాగడంతో పలువురు సిండికేట్ వ్యాపారులు తెలంగాణలో మద్యం దుకాణాలు దక్కించుకొని అక్కడ వ్యాపారాలు చేస్తున్నారు. తాజాగా కొత్త పాలసీ ప్రకటన నేపథ్యంలో తిరిగి తమ సొంత నియోజకవర్గాల్లో లిక్కర్ వ్యాపారాలు మొదలుపెట్టే పనిలో ఉన్నారు. వీరితో పాటు స్థానికంగా ఉన్న కూటమి నేతలు కొత్త సిండికేట్లతో జత కలుస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రూ.కోట్లలో గెలిచిన పందేల సొమ్మును సిండికేటులో పెట్టుబడి పెట్టే యోచనలో కొందరు నాయకులు ఉన్నారు. పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే సిండికేట్ వ్యాపారుల సమావేశాలు జరిగాయి. ఎక్కడెక్కడ ఎన్ని షాపులు వస్తాయి? ధరావతు సొమ్ము ఎంత చెల్లించాలి? ఎన్ని బెల్టు షాపులు ఏర్పాటు చేయొచ్చు? అమ్మకాలు ఎక్కడ ఎలా ఉంటాయి? ఎమ్మెల్యేలు, ఎక్సైజ్ అధికారుల పర్సంటేజీలు పోను తమకెంత మిగులుతుందనే అంశాలపై లెక్కలు వేయడంలో తలమునలై ఉన్నారు. తమ నియోజకవర్గ పరిధిలో బయటి వారు రాకుండా ఆలోచనలు చేస్తున్నారు.

పర్సంటేజీల కోసం పావులు

కల్లుగీత కార్మికులకు కేటాయించే దుకాణాల్లో రాజకీయ జోక్యం ఉండరాదనే డిమాండ్‌తో జిల్లాకు చెందిన గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, యాత, ఈడిగ తదితర గీతవృత్తి కుల సంఘాల నేతలు రెండు రోజుల క్రితం భీమవరంలో భేటీ అయ్యారు. గీత కార్మికులకు కేటాయించే పది శాతం షాపుల్లో కొంత మంది ఎమ్మెల్యేలు 50 శాతం పెట్టుబడి లేని వాటా అడుగుతున్నారని కొందరు నేతలు సమావేశం దృష్టికి తెచ్చారు. పార్టీ గెలుపు కోసం పని చేసిన సొంత పార్టీ వారినే పర్సంటేజీలు అడగడం ఏమిటని, ఎవరికీ భయపడాల్సిన పనిలేదని, ఎవరి స్థోమత మేరకు వారు కలసికట్టుగా షాపులకు టెండర్లు వేసుకోవాలని నిర్ణయించారు. నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో మరోమారు సమావేశమయ్యేందుకు వీరు సన్నద్ధమవుతున్నారు.

మందుబాబులకు తప్పని చేతిచమురు

ప్రభుత్వ దుకాణాల్లో పూర్తిస్థాయిలో స్టాకు లేకపోవడంతో మందుబాబులు తమకు కావాల్సిన బ్రాండ్ల కోసం బార్లను ఆశ్రయించి క్వార్టర్ బాటిల్‌పై రూ.70 నుంచి రూ.100 వరకు అదనంగా చెల్లించి చేతిచమురు వదిలించుకుంటున్నారు. బెల్టు వ్యాపారులు క్వార్టర్ బాటిల్‌పై రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తూ విక్రయాలు సాగిస్తున్నారు.

ప్రభుత్వ దుకాణాలు నిర్వీర్యం

నూతన పాలసీ ప్రకారం 12న ప్రైవేట్ దుకాణాల్లో మద్యం అమ్మకాలు మొదలుకానున్నాయి. అప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 202 ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా మద్యం అమ్మకాలకు ఎక్సైజ్ అధికారులు నిర్ణయించారు. తర్వాత ఇవి పూర్తిగా మూతపడనున్నాయి. ఈలోగా వాటిని నిర్వీర్యం చేసే దిశగా ఎక్సైజ్ శాఖ అడుగులు వేస్తోంది. అక్టోబరు ఒకటో తేదీ నుంచి మద్యం దుకాణాల్లో కొత్త బ్రాండ్లను అందుబాటులోకి తెస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. డిపోల నుంచి వస్తున్న స్టాకులో 80 శాతాన్ని బార్లకు తరలిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలకు అరకొరగా మాత్రమే ఇస్తున్నారు. జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు పట్టణాల్లో 25 వరకు బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి.

ఆందోళనలో ఉద్యోగులు

నూతన పాలసీతో పశ్చిమగోదావరి జిల్లాలోని దుకాణాల్లో పనిచేస్తున్న 898 మంది సూపర్‌వైజర్, సేల్స్‌మెన్, నైట్ వాచ్‌మెన్‌ల భవితవ్యం అగమ్యగోచరంగా తయారైంది. గత ప్రభుత్వం సూపర్‌వైజర్లకు రూ.21,500, సేల్స్‌మేన్‌లకు రూ.19,500, నైట్ వాచ్‌మేన్‌లకు రూ.9,500 వేతనంగా అందజేస్తూ వచ్చింది. ఇప్పుడు వీరంతా ఉద్యోగాలు కోల్పోతుండటంతో తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని కోరుతూ మంగళవారం ఉదయం నుంచి విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడ్డాయి. అధికారులతో చర్చలు అనంతరం మధ్యాహ్నం నుంచి వారంతా విధుల్లోకి చేరారు.

విశాఖ ఉక్కు రక్షణకు నిరాహార దీక్ష



నిరాహారదీక్షలకు మద్దతు తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత మామిళ్ళపల్లి జయప్రకాష్

ఏలూరు (టూటౌన్): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఆపాలని డిమాండ్ చేస్తూ ఏలూరు కలెక్టరేట్ వద్ద వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు నాయకులు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరాహార దీక్ష నిర్వహించారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ఈ నిరాహార దీక్షకు వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్, ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా మాజీ కార్యదర్శి, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం సాయంత్రం 4:30 గంటలకు కృష్ణ చైతన్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.సోమయ్య చేతుల మీదుగా నిమ్మరసాన్ని అందుకుని నిరాహార దీక్షను విరమించారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దసరా సందర్భంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి హైదరాబాద్‌కు ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌ఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దసరా తరువాత రోజు 13వ తేదీన తిరుగు ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా అనేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. రాను... పోనూ ఒకేసారి టికెట్ బుక్ చేసుకున్న వారికి తిరుగు ప్రయాణం టిక్కెట్ సౌకర్యం కింద 10 శాతం రాయితీ కూడా కల్పించడం జరిగిందన్నారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఏపీ టెట్ పరీక్షలు

ఏలూరు (టూటౌన్): ఏపీ టెట్ జూలై, 2024 పరీక్షలు ఈనెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహాం మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఏలూరులో రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిద్దార్థ క్వెస్ట్ సీబీఎస్‌ఈ స్కూల్, వట్లూరు, ఏలూరు నందు నిర్వహించే పరీక్షలకు మొత్తం 5,470 మంది హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్, వట్లూరు, ఏలూరు నందు ఈ నెల 6వ తేదీన ఒక్కరోజు మాత్రమే నిర్వహించే పరీక్షకు 200 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 5,670 మంది టెట్ పరీక్షకు హాజరుకానున్నట్లు డీఈఓ అబ్రహాం తెలియజేశారు. హాల్ టిక్కెట్‌ల నందు ఏమైనా తప్పులు ఉంటే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించి పరీక్ష కేంద్రం దగ్గర నామినల్‌రోల్స్ నందు సరిచేయించుకోవచ్చునన్నారు. ఈ నెల 11, 12 తేదీలలో దసరా సందర్భంగా సెలవు కావున ఆ రెండు రోజుల్లో పరీక్ష నిర్వహించబడదని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే 83281 86618, 90307 23444 సెల్ నెంబర్లకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్, గుర్తింపు ఐడీతో పరీక్షా సమయానికి ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్షా సమయం దాటిన పిదప ఏ ఒక్కరిని పరీక్షకు అనుమతించబోమని డీఈవో అబ్రహం తెలిపారు.

ఇసుక భారంపై 4న నిరసనలు




ఏ.రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి,ఏలూరు

ఏలూరు (టూటౌన్): ఉచిత ఇసుక విధానం పేరుతో గతం కంటే ఇసుక ధరలను విపరీతంగా పెంచి, అందుబాటులో లేకుండా చేసిన టీడీపీ కూటమి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 4న జిల్లాలోని అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో, ఇసుక ర్యాంపుల వద్ద ధర్నాలు, నిరసనలు, దీక్షలు నిర్వహించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ పిలుపు నిచ్చింది. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మంగళవారం మాట్లాడారు. అధికారంలోకి వస్తే ఇసుక ధరలను తగ్గిస్తామని, ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తాం అంటూ ఉత్తర ప్రగల్భాలు పలికన టీడీపీ నాయకులు దాన్ని మరింత భారంగా మార్చడం సిగ్గుచేటన్నారు. పేరుకే ఉచిత ఇసుక విధానం అని రవాణా రేట్లు, లోడింగ్, అన్‌లోడింగ్ రేట్లు గతంలో టన్ను రూ. 1500 ఉండగా ప్రస్తుతం అది రూ.2 వేల నుంచి రూ. 3 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరం ఉన్నవారికి ఇసుక అందుబాటులో లేకుండా చేస్తున్నారన్నారు.

కాల్‌మనీ నిర్వాహకులపై కేసు నమోదు

ఏలూరు టౌన్: కాల్‌మనీ గ్యాంగ్‌పై ఏలూరు వన్ టౌన్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం.. ఏలూరు దక్షిణపువీధికి చెందిన ఐలూరి సుబ్బలక్ష్మి భర్త రాజేష్ పౌరహిత్యం చేస్తుంటారు. వీరు ఏలూరుకు చెందిన వడ్డీ వ్యాపారి మేడపాటి సుధాకర్‌రెడ్డి వద్ద 2011లో అప్పు తీసుకుని తిరిగి చెల్లించారు. మళ్లీ 2019లో రూ.లక్షా 20 వేలు తీసుకుని ప్రతి వారం రూ.5 వేలు వడ్డీగా చెల్లించారు. సుమారు ఫోన్‌పే ద్వారా మరో రూ.8,75,900 కట్టారు. కానీ అప్పు తీసుకున్న సమయంలో సుబ్బలక్ష్మి తండ్రి నుంచి కూడా తీసుకున్న చెక్కులు, నోట్లు, తెల్లకాగితాలు అడ్డం పెట్టి అప్పు ఇంకా తీరలేదని కోర్టులో కేసులు వేసి బెదిరిస్తున్నారు. ఆమె ఇంట్లోని ఏసీ, స్కూటర్, ఇతర వస్తువులను మేడపాటి సుధాకర్ రెడ్డి, అతని భార్య లావణ్య, విద్యాసాగర్, రాజేష్, మరి కొందరు కలిసి దౌర్జన్యంగా, పట్టుకుపోయారు. సుబ్బలక్ష్మిని మానసికంగా, శారీరకంగా వేధిస్తూ అవమానపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

పాలకోడేరు: పాలకోడేరు మండలం శృంగవృక్షంలోని ఫ్రాస్కోగన మెమోరియల్ లెప్రసీ రిహాబిటేషన్ సెంటర్ వద్ద మంగళవారం లబ్ధిదారులకు కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా సామాజిక పింఛన్లు, పీడీఎస్ బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అదే ప్రాంగణంలో నివసిస్తున్న కుష్టురోగ బాధితుల కుటుంబాలను కలిసి పరామర్శించారు. కుష్టు వ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకుని ఆదరిస్తున్న రిహాబిటేషన్ సెంటర్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో లెప్రసీ రిహాబిటేషన్ సెంటర్ ఫాదర్ గాబ్రియేలు తోట, నిర్వాహకురాలు సిస్టర్ లూర్దు మేరీ, అడ్మినిస్ట్రేషన్ సిస్టర్ బ్రెజిత్, తదితరులు పాల్గొన్నారు.

గాంధేయవాదులకు సత్కారాలు



గాంధేయవాదులను సత్కరించిన కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): గాంధేయవాదమే దేశ ప్రగతికి మార్గదర్శకమని, యువ చైతన్యమే నవ భారత నిర్మాణ చైతన్యమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి, స్థూప పునః నిర్మాణ కమిటీల సహకారంతో మహాత్మాగాంధీ జయంతి పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్వాతంత్రోద్యమంలో భీమవరంనకు ప్రత్యేక స్థానం ఉందని, అమరవీరుల త్యాగాలకు ప్రతీకగా రెండోవ బార్డోలిగా ప్రసిద్ధి గాంచిందని అన్నారు. ఈ సందర్భంగా గాంధేయవాదులు పద్మశ్రీ డా ఎంఆర్ రాజు, తుమ్మలపల్లి మంగరాజు ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి శివ, మానవత సేవా సంస్థ సభ్యులు వర్మలను గాంధీ అవార్డులతో సత్కరించారు. వివిధ పాఠశాలల నుంచి 89 మంది విద్యార్థులు గాంధీజీ వేషధారణతో చేపట్టిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ గాంధీ స్మారక ఫౌండేషన్ చైర్మన్ పూర్ణచంద్ర గాంధీ (హైదరాబాద్), కార్యదర్శి రామచంద్రరావు, స్థూప పునః నిర్మాణ కమిటీ సభ్యుడు ఇందుకూరి ప్రసాద్‌రాజు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, బోండా వెంకట సుబ్బారావు, అరసవల్లి సుబ్రమణ్యం, మునిసిపల్ కమిషనర్ కె రామచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన



భీమవరంలో ఉద్యోగుల నిరసన



నరసాపురంలో ఉద్యోగుల ఆందోళన

భీమవరం: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసిన ఉద్యోగులు మంగళవారం భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సమీపంలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, దుర్గారావు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రభుత్వం మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న తాము కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ కారణంగా నిరుద్యోగులుగా మారే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని మొరపెట్టుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చి జీవో 7 గడువు సెప్టెంబర్ 30వ తేదితో ముగిసినందున తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తామనే స్పష్టమైన హామీ ఇచ్చే వరకు దుకాణాల్లో విధులకు హాజరుకాబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు ముత్యాలరాజు, సురేష్, కిరణ్, రమేష్, నరేంద్ర, విజయకుమార్, క్రాంతి, శివకుమార్, ఈశ్వర్, వెంకట్, పీఎల్‌డీ ప్రసాద్, సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు, నైట్ వాచ్‌మెన్లు పాల్గొన్నారు.

మా ఉపాధిపై దెబ్బకొట్టొద్దు

నరసాపురం: తమ ఉపాధిపై రాష్ట్ర ప్రభుత్వం దెబ్బకొట్టడం దారుణమని ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. గత ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉద్యోగులుగా చేరి ఉపాధి పొందుతున్నామని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం మద్యం పాలసీ మార్చి తమ పొట్టకొట్టారని వాపోయారు.

పైపులైన్‌కు మరమ్మతులు



మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

సాక్షి స్పందన

యలమంచిలి: కట్టుపాలెం వద్ద గత రెండు నెలలుగా నక్కల డ్రయిన్ వంతెనపై లీకవుతున్న పైపులైన్‌కు మంగళవారం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దగ్గరుండి మరమ్మతులు చేయించారు. ఈ పైపులైను లీకేజీపై సోమవారం సాక్షిలో 'పైపులైన్ లీకేజీతో రోడ్డు ధ్వంసం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మద్రిపూడి సురేష్‌బాబు స్పందించారు. ఆయన పైపులైన్ లీకేజీని అరికట్టాలని పంచాయతీ కార్యదర్శి పీతల రాజశేఖర్‌కు ఆదేశాలిచ్చారు. దీంతో వెంటనే స్పందించి సర్పంచ్ పొన్నమండ నాగరాజు సహకారంతో పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు, వాహనచోదకులు హర్షం వ్యక్తం చేశారు.

పింఛన్లకు కత్తెర

- ప్రతి నెలా పింఛన్ల తగ్గింపు
- మూడు నెలల్లో 4,238 పింఛన్ల తొలగింపు
- మరణాలంటూ లెక్కలు
- కొత్త పింఛన్ల ప్రస్తావనే లేదు



భీమవరం మండలం కొత్తపూసలమర్రులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

సాక్షి, భీమవరం: పింఛన్ల పంపిణీలో కూటమి ప్రభుత్వం తనదైన శైలిలో కొర్రి పెడుతోంది. ప్రతి నెలా పింఛన్ల సంఖ్యను తగ్గించడమే తరువాయిగా పరిస్థితి తయారైంది. మూడు నెలల వ్యవధిలో 4,238 పింఛన్లకు కోత పెట్టింది. మరోపక్క కొత్త పింఛన్ల ఊసెత్తడం లేదు. వేల దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టేయ్యడం పేదవర్గాల వారిని నిరాశకు గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడేనాటికి జిల్లాలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర సామాజిక పింఛన్ల లబ్ధిదారులు 2,34,161 మంది ఉన్నారు. జూలై నాటికి వీరి సంఖ్య 2,32,885 తగ్గగా ప్రస్తుత అక్టోబరు నెలకు గాను 2,30,123 మందికి చేరింది. ప్రతి నెలా వెయ్యి నుంచి 1200 వరకు పింఛన్ల తగ్గుదల కనిపిస్తోంది. గడిచిన మూడు నెలల్లో వివిధ కారణాలతో 4,238 మంది పింఛన్లను తొలగించారు. అధికశాతం మరణాల వలనే లబ్ధిదారులు తగ్గినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత నెలకు గాను లబ్ధిదారులకు చెల్లించేందుకు రూ. 96.57 కోట్లు విడుదల చేశారు. మంగళవారం రాత్రి నాటికి 97.8 శాతం పంపిణీ పూర్తయ్యింది. గతంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయగా ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి వెళ్లి అందిస్తున్నట్టు ప్రభుత్వం చెబుతున్నప్పటికి చాలా వరకు అందరిని ఒకచోటకు పిలిచి అక్కడే పింఛన్లు అందిస్తుండటంతో లబ్ధిదారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

పెండింగ్‌లో దరఖాస్తులు

కొత్త పింఛన్ల మంజూరు కోరుతూ మండల, జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమానికి దరఖాస్తులు వేలల్లో వస్తున్నాయి. తమ అర్హతను ధ్రువీకరించి పింఛన్ అందించాలని వారు వేడుకుంటున్నారు. నెలల తరబడి ప్రభుత్వసాయం కోసం పేదవర్గాల వారు ఎదురుచూస్తున్నారు. కాగా కొత్త మంజూరు ఇచ్చే దిశగా ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం వారిని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

నాయకుల హడావిడి : ఏ ప్రభుత్వంలోనైనా కొత్తగా పథకాలు ప్రవేశపెట్టేటప్పుడు సంబరాలు చేసుకోవడం ఆనవాయితీ. కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. సూపర్ సిక్స్ అంశాలను మరుగునపెట్టేందుకు ప్రతినెలా 1వ తేదీన పింఛన్ల పంపిణీని ఆర్భాటం చేస్తోంది. సచివాలయ ఉద్యోగులతో పాటు కూటమి నేతలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సాయం అందిస్తూ ఫొటోలకు ఫోజులు ఇస్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. తామేదో ఇంటిలోంచి తీసుకువచ్చి ఇస్తున్నట్టుగా వారు హడావిడి చేస్తుండటం లబ్ధిదారులకు ఇబ్బందికరంగా తయారవుతోంది.

లాగిన్ గడువు కుదింపు

గత ప్రభుత్వంలో 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ చేసేందుకు సచివాలయ ఉద్యోగులకు లాగిన్ గడువు ఉండటంతో మూడు, నాలుగు తేదీల్లో దూర ప్రాంతాల్లో ఉంటున్న వారు వచ్చి పింఛన్ సాయం తీసుకుని వెళ్లేవారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ పింఛన్ తీసుకునేందుకు రాలేని వారి వద్దకు వలంటీర్ వెళ్లి సాయం అందించి వచ్చేవారు. ఇతర జిల్లాలతో పాటు హైదరాబాద్ వరకు కూడా వెళ్లి ఆస్పత్రుల్లోని లబ్ధిదారులకు పింఛన్ సాయం అందించిన వలంటీర్లు ఎంతోమంది ఉన్నారు. ప్రస్తుతం సచివాలయ ఉద్యోగుల ద్వారా సాయం అందించినప్పటికి రెండు రోజులు మాత్రమే గడువివ్వడంతో చాలావరకు స్థానికంగా అందుబాటులో ఉన్నవారికి మాత్రమే పింఛన్ అందజేస్తున్నారు. ఏమైనా కారణాలతో ఈనెలలో పింఛన్ తీసుకోని వారికి వచ్చే నెలలో జతచేసి అందజేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చడం లేదు. ఏ నెలకు ఆ నెల రెండు రోజుల గడువు ముగిశాక మిగిలిన మొత్తాన్ని సచివాలయ ఉద్యోగులు తిరిగి బ్యాంకుల్లో జమచేస్తున్నారు. దీంతో ఈనెలలో సాయం అందని వారికి వచ్చే నెలలో కలిపి ఇవ్వక నష్టపోవాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

ప్రొటోకాల్ పాటించలేదు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నరసాపురం మునిసిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

నరసాపురం: అన్న క్యాంటీన్ ప్రారంభంలో ప్రొటోకాల్ పాటించని మునిసిపల్ కమిషనర్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ నరసాపురం మునిసిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మంగళవారం కలెక్టర్ సీహెచ్ నాగరాణికి వినతిపత్రం అందజేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ సమయంలో పట్టణ ప్రథమ పౌరురాలినైన తన ఫ్లెక్సీ, ప్రజలతో ఎన్నుకోబడ్డ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల ఫ్లెక్సీలు చింపేసి దారుణంగా వ్యవహరించినా మునిసిపల్ అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా ప్రారంభ కార్యక్రమం చేసుకుని రాజ్యాంగం తమకు కల్పించిన హక్కును కాలరాశారని పేర్కొన్నారు. మునిసిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, కౌన్సిలర్లు అడిదల శ్యామల, కావలి రామసీత, మల్లాడి శేషవేణి, ద్వారా గంగాభవానీ, చిట్టూరి లక్ష్మి, పతివాడ పద్మ, వైఎస్సార్ సీపీ నేతలు షేక్ బులిమస్తాన్, కామన బుజ్జి, కావలి నాని ఉన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి దసరా సెలవులు

ఉత్తర్వులు జారీ చేసిన విద్యా శాఖ

నిడమర్రు: పాఠశాలలకు విద్యా శాఖ దసరా సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 4 నుంచి దసరా సెలవులు ప్రారంభం కావాలి. 2న గాంధీ జయంతి రావడంతో ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు 3 నుంచే దసరా సెలవులు ఇవ్వాలని కోరడంతో ఈ నెల 3 నుంచి 13 వరకూ దసరా సెలవుల ప్రకటన ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ దసరాకు వరుసగా 12 రోజులు సెలవులు రానున్నాయి. క్రిస్టియన్ మైనార్టీ విద్యాసంస్థలకు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 11 నుంచి 13 వరకూ దసరా సెలవులు ఉంటాయి. డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగ నేపథ్యంలో క్రిస్టియన్ మైనార్టీ విద్యాసంస్థలకు డిసెంబర్ 20 నుంచి 29 వరకూ 10 రోజులు క్రిస్మస్ సెలవులు ఇస్తారు. గత నెలలో భారీ వర్షాల నేపథ్యంలో పలు స్కూళ్లకు దాదాపు 5 నుంచి 7 వరకూ కాంపెన్సేటరీ హాలిడేస్ ఇచ్చారు. దీంతో అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాల పనిదినాలు తగ్గుతున్నట్లు భావించి ఈ దసరా సెలవుల్లో పాఠశాల తెరిచేందుకు నిర్ణయించుకుంటే తప్పని సరిగా ఉన్నత అధికారులకు సమాచారం ఇవ్వాలని ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. అబ్రహం ఆదేశాలు జారీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా స్కూళ్లు తెరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలుశిక్ష

నూజివీడు: తన ఖాతాలో నగదు లేనప్పటికీ చెక్కు ఇచ్చిన నేరానికి ప్రత్తిపాటి లోకరాజుకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.5 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన మల్లవల్లి ప్రవీణ్‌కుమార్ 2019 ఆగస్టులో తాడేపల్లిగూడెంకు చెందిన ప్రత్తిపాటి లోకరాజుకు రూ.4 లక్షల నగదు అప్పుగా ఇచ్చాడు. కొంతకాలం తరువాత ప్రవీణ్‌కుమార్ తన బాకీ తీర్చమని లోకరాజును అడగగా అతను ప్రవీణ్‌కుమార్‌కు రూ.4 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును ప్రవీణ్‌కుమార్ బ్యాంకులో వేయగా అక్కౌంట్‌లో నగదు లేదని వెనక్కు తిరిగి వచ్చింది. దీంతో లోకరాజుపై కేసు వేయగా విచారణ అనంతరం లోకరాజుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

నిప్పంటించుకుని వృద్ధురాలి మృతి

దెందులూరు: దెందులూరు మండలం కొవ్వలిలో ఒక స్థల వివాదానికి సంబంధించిన జరిగిన గొడవలో తమకు అన్యాయం జరిగిందంటూ ఒక వృద్ధురాలు ఒంటిపై పెట్రోలుపోసుకుని నిప్పంటించుకుంది. కొవ్వలికి చెందిన దేవినేని రామతులసి (68) తనకు న్యాయం చేయాలంటూ మంగళవారం ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. ఆమెను ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో విజయవాడ తరలిస్తుండా మార్గమధ్యలో మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి

కై కలూరు: ఈత సరదా ఓ యువకుడి ప్రాణాలు తీసింది. కై కలూరు టౌన్ పోలీసుల వివరాల ప్రకారం కై కలూరు కాపుల వీధిలో బంగారపు పనిచేసే గోపాలపురపు త్రినాథాచారి కుమారుడు నారాయణ(18) ఇటీవల ఇంటర్ మానేశాడు. మంగళవారం స్నేహితులు గుణ, ప్రశాంత్‌తో కలసి గోపవరంలోని చెరువు వద్దకు వెళ్ళాడు. ఈతకు దిగారు. గుణ నీటిలో మునగడంతో రక్షించడానికి నారాయణ దిగాడు. గుణ బయటకు వచ్చినా నారాయణ రాలేదు. స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న బంధువులు ఘటన స్థలానికి వచ్చారు. చెరువులో గాలించగా నారాయణ మృతదేహం సాయంత్రం లభించింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఐఐటీ, ఐఐఎం విద్యార్థులకు దీటుగా

- సంబల్‌పూర్ ఐఐఎం బూట్ శిబిరంలో తణుకు విద్యార్థులు
- ఆకట్టుకున్న రైల్వేస్టేషన్ నేవిగేషన్ సాఫ్ట్‌వేర్



తణుకు విద్యార్థులు తయారు చేసిన రైల్వే ఇంటర్‌ఫేస్ డిజైన్ యాప్ నమూనా


పంబల్‌పూర్ ఐఐఎంలో తణుకు డిగ్రీ కాలేజీ విద్యార్థులు

తణుకు టౌన్: కళాశాల స్థాయి విద్యార్థుల్లో ఔత్సాహిక వ్యాపార లక్షణాల్ని పెంపొందించేందుకు కేంద్రం ప్రభుత్వం పలు సదస్సులు, శిబిరాలు నిర్వహిస్తోంది. భవిష్యత్ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు దేశంలో పేరెన్నికగన్న విద్యాలయాలకు చెందిన విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా కేంద్ర విద్య మంత్రిత్వ శాఖ, ఏఐసీటీఈలు సంయుక్తంగా దేశంలోని ప్రముఖ ఐఐటీలు, ఐఐఎంలు, యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులతో బూట్ శిబిరాలు నిర్వహిస్తోంది. సెప్టెంబరు 23 నుంచి 28 వరకూ దేశంలోని 15 నగరాల్లో ఐఐటీ, ఐఐఎం, విద్యార్థులకు ఈ శిబిరాలు నిర్వహించారు. ఒడిశాలోని సంబల్‌పూర్ ఐఐఎంలో నిర్వహించిన బూట్ శిబిరంలో తణుకు పట్టణానికి చెందిన శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు. దేశంలోనే ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈ శిబిరాలకు ఎంపిక కావడం ఇదే ప్రథమమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ తెలిపారు.

ఔత్సాహిక వ్యాపార నైపుణ్యాలు ఐఐటీ, ఐఐఎం విద్యార్థుల్లోనే కాకుండా సాధారణ డిగ్రీ విద్యార్థుల్లో కూడా ఉంటుందని ఈ శిబిరం చాటిచెప్పింది. తణుకు డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు ఎం.శ్రీలత, కే మహేష్, కె.అభిషేక్, పీ సుబ్రహ్మణ్యం సంబల్‌పూర్ ఐఐటీలో జరిగిన ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ బూట్ శిబిరంలో పాల్గొన్నారు. ఈ శిబిరంలో పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఢిల్లీ, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఐఐటీ, ఐఐఎం విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా యూనివర్సిటీలు, ఐఐటీ విద్యార్థులు రూపొందించిన అనేక నమూనాలు ఇక్కడ ప్రదర్శించారు.

రైల్వేస్టేషన్ నేవిగేషన్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ రూపకల్పన

రైల్వేస్టేషన్లలో ఇతర రాష్ట్రాల ప్రయాణికులు అక్కడి సేవలు తెలుసుకునేందుకు ఇబ్బంది పడుతుంటారు. బూట్ శిబిరంలో పాల్గొన్న తణుకు విద్యార్థులు రూపొందించిన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తుంది. ఈ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ ద్వారా స్టేషన్‌కు ఉన్న రోడ్లు, ప్రవేశ, నిష్క్రమణ, టికెట్ బుకింగ్ కౌంటర్, రిజర్వేషన్ కౌంటర్, ఎస్కలేటర్లు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు యాప్‌లో త్రీడీ రూపంలో వస్తాయి. మనకు కావలసిన టికెట్ కౌంటర్‌ను సెలెక్ట్ చేస్తే త్రీడీ డైరెక్షన్‌లో చూపిస్తుంది. దీని ద్వారా మనకు సమయాన్ని, ట్రాఫిక్‌ను తగ్గిస్తూ ఇతర భాషలు రాని వారికి ఉపయోగకరంగా ఉంటుంది. బూట్ శిబిరంలో పాల్గొన్న వారిని ఈ ప్రయోగం ఆకట్టుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది తెలిపారు.

ఐఐఎం, ఐఐటీ విద్యార్థులతో సమానంగా..



బూట్ శిబిరంలో సాధారణ డిగ్రీ విద్యార్థులుగా పాల్గొనడం గర్వంగా వుంది. ఐఐటీ, ఐఐఎం విద్యార్థులకు ఏ మాత్రం తీసిపోని విధంగా మా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మోడల్‌ను ప్రదర్శించాం. మా ప్రదర్శను దేశం నలుమూలల నుంచి విచ్చేసిన విద్యార్థులతో పాటు మెంటార్లు కూడా అభినందించారు.

– ఎం.శ్రీలత, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్

స్టార్టప్‌లకు ప్రోత్సాహం బాగుంది



స్టార్టప్‌లకు అవసరమైన ఆలోచనలతో బూట్ శిబిరానికి వెళ్లాం. ఆచరణ సాధ్యమైన ఐడియా ఉంటే పెట్టుబడి పెట్టేందుకు దేశంలో చాలా మంది సిద్ధంగా వున్నారని ఈ శిబిరం ద్వారా తెలిసింది. మా ప్రదర్శన చూసిన కొన్ని సలహాలు ఇచ్చి మెచ్చుకున్నారు.

–కె.మహేష్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్

ఉపాధి సమస్యకు పరిష్కారం



జాతీయ స్థాయి బూట శిబిరంలో దేశం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థుల ఐడియాలతో కొత్త ఆవిష్కరణలకు నాంది పలికారు. దేశంలో కొత్త ఎంటర్‌ప్రెన్యూర్‌లు కొత్త ఆవిష్కరణలతో పరిశ్రమలు, వ్యాపారాలు చేపడితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

–పీ సుబ్రహ్మణ్యం. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్

విద్యార్థి దశలోనే ప్రోత్సహించాలని..



విద్యార్థుల్లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పెంచేందుకు ప్రిన్సిపాల్ పీ అనిల్ కుమార్ కళాశాల స్థాయిలో ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశారు. సంబల్‌పూర్‌లో జరిగిన బూట్ శిబిరంలో మా విద్యార్థులు తమ ఆలోచనలు జాతీయ స్థాయిలో వివరించడం గర్వకారణం. డాక్టర్ ఐవీ నారాయణ,

కో–ఆర్డినేటర్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెంటర్

దేశ అభివృద్ధిలో భాగస్వాములుగా..



విద్యార్థి దశలోనే దేశ అభివృద్ధిలో బాగస్వాముల్ని చేసే దిశగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన కోసం బూట్ శిబిరం నిర్వహించారు. విద్యార్థుల్లో ఉన్న ఎంటర్‌ప్రెన్యూర్ నైపుణ్యాల్ని ఈ శిబిరం ద్వారా మెరుగుపర్చుకునే అవకాశం పెరిగింది.

–ఆర్.అశోక్ కుమార్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు, మెంటార్

పారిశుద్ధ్య కాంట్రాక్టరుకు నోటీసు జారీ


సిబ్బంది నియామకంపై టెండర్ కండిషన్

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం పారిశుద్ధ్య కాంట్రాక్టులో అక్రమాలపై సాక్షి దినపత్రికలో ప్రచురితమవుతున్న వరుస కథనాలపై ఎట్టకేలకు అధికారుల్లో చలనం కలిగింది. ఈ క్రమంలో సెవెన్‌హిల్స్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కాంట్రాక్టర్‌కు సోమవారం నోటీసు జారీ చేశారు. జిల్లా కలెక్టర్‌కు సంబంధిత నివేదికను సమర్పించినట్టు సమాచారం. దేవస్థానంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణను 2022 అక్టోబర్ 1 నుంచి, 2024 సెప్టెంబర్ 30 వరకు సెవెన్‌హిల్స్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు అప్పగించారు. 132 మందితో బిల్డింగ్, ఓపెన్ ఏరియా 1,17,165 స్క్వేర్ మీటర్స్ పరిధిలో పనులు జరిపించాలని దేవస్థానం అధికారులు టెండర్ షరతుల్లో పేర్కొన్నారు. కార్మిక చట్టానికి లోబడి సిబ్బందికి జీతభత్యాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అయితే ఆచరణలో అవేమీ అమలు కాలేదు. గతనెల 30న 'పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం జరిగేనా' శీర్షికతో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. అదే రోజు సంబంధిత కాంట్రాక్టరుకు 15 రోజుల లోపు సమాధానం చెప్పాలంటూ నోటీసు జారీ చేశారు. ఇదిలా ఉంటే స్క్వేర్ మీటర్లలో పనులు చేయించేటప్పుడు 132 మంది కార్మికులు ఉండాల్సిన అవసరం లేదని, కార్మిక చట్టాలను చూసుకోవాల్సిన బాధ్యత కాంట్రాక్టరుదేనని సంబంధిత అధికారులు కొత్త వాదనలను తెరపైకి తెస్తున్నట్టు తెలుస్తోంది. కాంట్రాక్టరు ఎంత మంది కార్మికులను నియమిస్తున్నారు, వారికి పీఎఫ్‌లు ఇతర అలవెన్స్‌లు సక్రమంగా ఇస్తున్నారా.. లేదా అనేది విషయాలను పరిశీలించిన తరువాతే అధికారులు ప్రతి నెలా బిల్లులను కాంట్రాక్టరుకు చెల్లించాలి. ఆ నిబంధనలు అమలు కాలేదు.

దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు


నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

నరసాపురం: మొగల్తూరు మండలం రాజుగారితోటలో సోమవారం జరిగిన దారిదోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణ విలేకరులకు వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లికి చెందిన పారాక చంద్రరావు కొంతకాలం గల్ఫ్‌లో ఉండి తిరిగివచ్చాడు. అతనికి అదే ప్రాతానికి చెందిన మేడిది వెంకటరెడ్డి వ్యాపారంలో జతకలిశాడు. ఇద్దరికి వ్యాపారంలో ఇబ్బందులు రావడంతో చంద్రరావు కృష్ణాజిల్లా కలిదిండి వెళ్లి వ్యాపారం చేసుకుంటున్నాడు. అక్కడ చంద్రరావు వ్యాపారం బాగా సాగుతుండటంతో వెంకటరెడ్డి అసూయపడ్డాడు. చంద్రరావును దెబ్బతీయాలని పథకం రచించాడు. రాజోలుకు చెందిన ఆకుల ప్రభుతేజ, సాధనాల మణికంఠ సాయితేజ, భయ్యా హిమసాగర్, కోరుకొండ గిరిబాబు, గంటా రాజు, జవ్వాడి మలికిబాబులతో కలసి పథకం పన్నాడు. వెంకటరెడ్డి సోమవారం చంద్రరావుకు వేరేవాళ్లతో ఫోన్ చేయించి తమ వద్ద రూ.2 లక్షలు విలువ చేసే గల్ఫ్ కరెన్సీ ఉందని, మొగల్తూరు మండలం రాజుగారితోట ప్రాంతానికి డబ్బుతో రావాలని చెప్పారు. దీంతో చంద్రరావు సొమ్ముతో అక్కడికి రాగా దాడిచేసి నగదు ఉన్న బ్యాగ్ పట్టుకుని పరారయ్యారు. ప్రత్యేక టీమ్ లాడ్జిలపై నిఘా పెట్టగా పట్టణంలోని ఓ లాడ్జిలో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు చెప్పారు. వారి నుంచి రూ 1.70 లక్షలు నగదు, ఖతార్ నోట్లు 10, రెండు మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

రోల్‌బాల్ పోటీలకు ఎంపిక


స్కూల్ గేమ్ ఫెడరేషన్ రోల్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

తణుకు అర్బన్: 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా రోల్‌బాల్ సెలక్షన్స్ మంగళవారం తణుకు మున్సిపల్ స్కేటింగ్ రింగ్‌లో నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 50 మంది పాల్గొనగా 15 మంది ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు బి.జాన్సన్ తెలిపారు. ఈ పోటీలకు చీఫ్ కోచ్ లావణ్య, కోచ్ కె.చంద్రమౌళి సెలక్షన్స్ నిర్వహించగా ఎంపికైన క్రీడాకారులు ఈ నెలలో తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు స్కూల్ గేమ్స్ సెక్రటరీ పీఎస్ఎన్ మల్లేశ్వరరావు తెలిపారు.

గాంధీ ఆశ్రమం వెలవెల


మండవల్లి శ్రీ గాంధీ సేవాశ్రమం


ఆశ్రమంలో నిర్మించిన గాంధీజీ స్తూపం

మండవల్లి: మండవల్లిలోని గాంధీ సేవాశ్రమం అభివృద్ధి లేక వెలవెలబోతోంది. అప్పటి స్వాతంత్ర్య సమరయోధుడు మానేపల్లి మల్లికార్జున గుప్తా, యేర్నేని సుబ్రహ్మణ్యం ఆశ్రమాన్ని నిర్మించారు. గ్రామ ప్రముఖులు సుమారు 5.45 ఎకరాల్ని విరాళంగా ఇవ్వడంతో పలువురి సహకారంతో ఆశ్రమ నిర్మాణానికి పూనుకున్నారు. మల్లికార్జున గుప్తా, యేర్నేని సుబ్రహ్మణ్యం గాంధీతో కలిసి సబర్మతి ఆశ్రమంలో కొంతకాలం ఉన్నట్లు గ్రామ పెద్దలు చెబుతారు.

ఆశ్రమాన్ని దేవదాయ శాఖకు అప్పగించిన అనంతరం మొదటి ఆశ్రమ చైర్మన్‌గా మానేపల్లి మల్లికార్జున గుప్తా విధులు నిర్వహించారు. అప్పటి నుంచి మారగాని రామచంద్రరావు, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, గంగునేని వర ప్రసాద్ చైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆశ్రమానికి పాలకవర్గం లేదు. దేవదాయ శాఖ ఈవోగా కె దివ్యశ్రీ విధులు నిర్వహిస్తున్నారు. రెండు ఎకరాలలో చేపల చెరువులు, రెండున్నర ఎకరాలలో వరిసాగు భూమి, మిగిలిన భూమిలో ఆశ్రమ నిర్మాణం, గాంధీజీ స్థూపం ఉన్నాయి.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం

గతంలో కళకళ

గతంలో ఆశ్రమం కళకళలాడేది. నూలు వడకడం, మల్బరీ తోటల పెంపకం, కూరగాయ మొక్కల పెంపకం, కుటీర పరిశ్రమలు నిర్వహించేవారు. ప్రస్తుతం గాంధీ సేవాశ్రమం వెలవెలబోతుంది. పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు పలువురు వాపోతున్నారు. ఆశ్రమానికి ప్రహరీ లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. గాంధీజీ ఆశయాలకు భిన్నంగా ఈ ఆశ్రమం ఉంది. ఖాదీ బోర్డు నుంచి నిధులు సేకరించి ఆశ్రమాన్ని అభివృద్ధి చేసి గాంధీజీ ఆశయాలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి.

గత వైభవం తీసుకురావాలి



గాంధీ సేవాశ్రమానికి గత వైభవం తీసుకురావాలి. గతంలో ఆశ్రమం పలు అభివృద్ధి కార్యక్రమాలతో కళకళలాడేది. ప్రస్తుతం ఆశ్రమం వెలవెలబోతుంది. ఆశ్రమ అభివృద్ధికి ఎండోమెంట్స్ శాఖాధికారులు చర్యలు చేపట్టాలి. గాంధీజీ ఆశయాలు కొనసాగేలా చూడాలి.

చొప్పరపు పిచ్చయ్య, మండవల్లి

గాంధీ ఆశ్రమాన్ని అభివృద్ధి చేయాలి



జూదం, అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆశ్రమంలో పశువులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఆశ్రమానికి పాలకవర్గం లేకపోవడంతో అడిగే నాథుడు లేడు. వెంటనే పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలి.

అర్జా రవి, మండవల్లి

బైక్ చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మోటార్ సైకిల్ చోరీకి గురైందని బాధితుడు చిలుకూరి జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. జగదీష్ గత నెల 23వ తేదీన ద్వారకాతిరుమల నుంచి జంగారెడ్డిగూడెం వచ్చాడు. స్థానిక జాబిల్లి ఆసుపత్రి బయట బైక్‌ను పార్క్ చేసి లోపలికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తి తన మోటార్‌సైకిల్‌ను చోరీ చేసినట్లు గుర్తించి, ఫిర్యాదు చేశాడన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

భీమవరం: గత నెల 29న ఏఎస్ఆర్ నగర్ ప్రాంతంలోని జమ్మిచెట్టు వద్ద మద్యం సేవించి బైక్ నడుపుతున్న కె.భాస్కర్, డి.రమేష్‌ను డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అరెస్టు చేసినట్లు సీఐ కాళీచరణ్ మంగళవారం చెప్పారు. వారిని భీమవరం స్పెషల్ జ్యుడీషయల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. పట్టణానికి చెందిన 6వ తరగతి బాలిక తల్లిదండ్రులు విడిగా ఉంటున్నారు. బాలిక ఏలూరులోని తండ్రి వద్దకు అప్పుడప్పుడు వెళ్తుంది. గత నెల 30 తెల్లవారుజామున బాలిక ఇంటినుంచి వెళ్లిపోయిందన్నారు. బాలిక తల్లి చుట్టుపక్కల, ఏలూరులో బాలిక తండ్రి వద్ద వాకబు చేసినా బాలిక ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం ఫిర్యాదు చేశారు.

గుర్తుకొస్తున్నాయి..


పేరుపాలెం బీచ్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు


హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయిని సన్మానిస్తున్న అలనాటి స్నేహితులు

మొగల్తూరు: భీమవరం లూథరన్ ఉన్నత పాఠశాలలో 1976–77 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు మంగళవారం పేరుపాలెం సముద్ర తీరంలో కలుసుకుని తమ పాత జ్ఞాపకాల్ని నెమరువేసుకున్నారు. సముద్రపు అలల సవ్వడి మధ్య ఆలనాటి స్నేహితులంతా కబుర్లతో సరదా సరదాగా గడిపారు. 47 ఏళ్ల క్రితం చేసిన అల్లరి, టీచర్లతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వీరిలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి తదితరులు ఉన్నారు. జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, రిటైర్డ్ అగ్నిమాపకశాఖాధికారి ఎస్.సురేంద్ర ఆనంద్, వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన అధికారులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ పదవీ విరమణ అనేది పదవికి మాత్రమేనని, వయసుకు కాదని, ఇలా కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకోవడం మధురానుభూతని పేర్కొన్నారు. ఇలా కలుసుకోవడం ఇది మూడోసారని, ఇలాంటి అహ్లాదకర వాతావరణంలో కలుసుకోవడం ఉత్సాహంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆత్మీయ సమ్మేళన కమిటీ సభ్యులు బొండా రామకృష్ణారావు, కారుమూరి భాస్కరరావు, అయితా వెంకటకృష్ణారావు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పాలడుగుల వెంకట కమలాకర్, సన్నమడ ప్రసాదరావు, నూకల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

45 బైక్‌లు స్వాధీనం


గణపవరంలో స్వాధీనం చేసుకున్న బైక్‌లు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రవణ్‌కుమార్

గణపవరం: జిల్లావ్యాప్తంగానే కాకుండా పొరుగు జిల్లాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను గణపవరం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి 45 బైక్‌లు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని ఏలూరు డీఎస్పీ శ్రవణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం గణపవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. కొయ్యలగూడెం మండలం గవరవరానికి చెందిన చప్పిడి ముసలయ్య చెడువ్యసనాలకు బానిసై ఏలూరు జిల్లాతోపాటు కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలలో బైక్ దొంగతనాలకు పాల్పడేవాడు. జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు నిడమర్రు సీఐ ఎంవి సుభాష్ ఆధ్వర్యంలో ఎస్ఐ మణికుమార్, పోలీసు సిబ్బంది నిందితుడిని ఈ నెల 1న అదుపులోకి తీసుకుని అతని నుంచి 16 ద్విచక్రవాహనాలు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీలో భాగస్వామిగా ఉన్న గణపవరం మండలం ముగ్గుళ్ల గ్రామానికి చెందిన శెట్టి చిన్నాను గత 23న గణపవరంలో అరెస్టు చేసి అతని నుంచి 29 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.40 లక్షల పైగా ఉంటుందన్నారు.

క్లుప్తంగా

వడ్డి రఘురాం నాయుడుకు అభినందనలు


వడ్డి రఘురాం నాయుడుకు అభినందనలు చెబుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన తాడేపల్లిగూడెంనకు చెందిన వడ్డి రఘురాంనాయుడును మంగళవారం సాయంత్రం ఆయన ఇంటి వద్ద జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీటీసీ మార్ల పూడి సుబ్బారావు, ఎం.సతీష్, బ్రహ్మయ్య, కొండబోయిన కృపావరం వెంకటేష్‌లు కలిసి పుష్పమాలతో సత్కరించి, అభినందించారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన ర్యాలీ


తణుకులో ర్యాలీ చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్‌లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

తణుకు టౌన్: విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమని పలువురు వక్తలు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ కేడెట్‌లు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మంగళవారం తణుకులోని మహిళా కళాశాల నుంచి పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయం, నరేంద్ర సెంటర్ మీదుగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ యూ లక్ష్మీసుందరిబాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె శ్యామలాదేవి, సీహెచ్ రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ కేడెట్‌లు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ సీఐగా మణికంఠరెడ్డి


తణుకు ఎక్సైజ్ సీఐ మణికంఠరెడ్డి

తణుకు: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా సత్తి మణికంఠరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. జగ్గయ్యపేట నుంచి బదిలీపై వచ్చిన మణికంఠరెడ్డి మంగళవారం విధుల్లోకి చేరారు. ఆయన స్థానంలో ఇక్కడ పని చేసిన మద్దాల శ్రీనివాసరావు పాలకొల్లు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ మణికంఠరెడ్డికి కింది స్థాయి అధికారులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు.

దసరా నవరాత్రులకు సర్వం సిద్ధం


కరపత్రాలను విడుదల చేస్తున్న ఆర్యవైశ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వాసవి ఆలయంలో దేవి శరన్నవరాత్రుల పూజలలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొర్లేపర రాము, సెక్రటరీ నున్న బాల త్రిపుర సుందర రావు, కోశాధికారి భోగవిల్లి రమేష్, ఉపాధ్యక్షుడు కొండూరు రాము, కొర్లపర సూరిబాబు, పాబోలు రాజగోపాలంలు పేర్కొన్నారు. ఆలయంలో మంగళవారం దేవి నవరాత్రి మహోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. భక్తులు హాజరై అమ్మవార్లను దర్శించాలని, ప్రత్యేక పూజలలో పాల్గొనాలని ఆర్యవైశ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు ఆలపాటి సత్యనారాయణ, చిన్న, పులవర్తి రాంపండు, పవన్, చలంచర్ల గుప్తా, కొత్త శివ తదితరులు పాల్గొన్నారు.

దేవుడి పేరుతో రాజకీయం తగదు

- సూపర్ సిక్స్ అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- స్వార్థ రాజకీయాల కోసమే దుష్ప్రచారం
- లడ్డూ ప్రసాద వ్యవహారంలో భక్తుల్లో అయోమయం
- నిరాధార ఆరోపణలతో శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీస్తారా అంటున్న ప్రజానీకం


తణుకులో వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహించిన మాజీ మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, పార్టీ శ్రేణులు (ఫైల్)


తణుకు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న మాజీ మంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు (ఫైల్)

తణుకు అర్బన్ : సూపర్ సిక్స్ హామీల అమలులో విఫలమైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల దృష్టిని మళ్లించేందుకు తిరుమలలో లడ్డూ తయారీని తన స్వార్థ రాజకీయాలకు వాడుకోవాలని చూస్తున్నారని హిందూ సంఘాలతో పాటు ఇతర మతస్థులు సైతం వాదిస్తున్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా కూటమి నేతలు మాట్లాడుతుండడం ఎంతవరకు సబబంటూ ప్రజానీకం, భక్తులు ప్రశ్నించే పరిస్థితి తలెత్తింది. అసలు ఎటువంటి కల్తీ నెయ్యి శ్రీవారి లడ్డు ప్రసాదానికి ఉపయోగించలేదని, వచ్చిన ట్యాంకర్లకు మూడు రకాల టెస్ట్‌లు చేసిన తరువాత మాత్రమే టీటీడీలోకి ట్యాంకర్లు ప్రవేశించే పరిస్థితి ఉంటుందని టీటీడీ అధికారులు చెబుతున్నప్పటికీ కూటమి నేతలు భక్తులను తప్పుదారి పట్టించే విధంగా మాట్లాడుతున్నారని భక్తులు సైతం తలలుపట్టుకుంటున్నారు.

100రోజుల అసమర్థపాలన డైవర్షన్ కోసమేనా

కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయినా ఇప్పటివరకు పింఛన్లు పెంపు పంపిణీ తప్ప మరేఇతర సంక్షేమాన్ని అమలుచేయకపోవడం, సూపర్ సిక్స్ ఊసే లేకపోవడం వంటి విషయాలపై ఇప్పటికే ప్రజలు నిలదీస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. అంతే కాకుండా తల్లికి వందనం పథకాన్ని విపరీతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో నీకు 15వేలు, నీకు 18వేలు అంటూ ఇంటింటికీ బాకా ఊదరగొట్టినా అవేమీ అమలు చేయపోవడంతో వీటన్నిటి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే శ్రీవేంకటేశ్వరుడి లడ్డు ప్రసాదాన్ని వివాదం చేశారంటూ భక్తులు దుమ్మెత్తిపోస్తున్నారు. విజయవాడ వరదల్లో ప్రజలు నిలదీస్తున్నారని బోట్లతో ప్రకాశం బ్యారేజ్‌ను కూలగొట్టాలని పథకం పన్నారంటూ డ్రామాకు తెరతీశారని ఇలా ప్రజలు నిలదీస్తారనే సందర్భాల్లో ఏదోక వివాదాన్ని తెరమీదకు తెచ్చే క్రమంలోనే ఇప్పుడు శ్రీవారి లడ్డు ప్రసాదంపై అభాండాలు మోపి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఇటువంటి రాజకీయాలు చేసే వారిని ఆ శ్రీవేంకటేశ్వరస్వామి తగిన శిక్ష వేస్తారంటూ ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారు.

చంద్రబాబుకు తగిన శిక్ష తప్పదు



నిరాధార ఆరోపణలతో వెంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదంపై చంద్రబాబు మచ్చపడేలా చేశాడు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా దుర్మార్గపు ఆరోపణలు చేసినందుకు కలియుగ ప్రత్యక్ష దైవం తగిన శిక్ష వేస్తాడు. అత్యున్నత న్యాయస్థానం సైతం కల్తీనెయ్యి వాడలేదని టీటీడీ చెబుతోందని, సెప్టెంబరు 18నాటి ముఖ్యమంత్రి ప్రకటనకు సంబంధించి ఏ ఆధారం లేదని అనడం మంచి పరిణామం. ఏమైతేనే భక్తులు, ప్రజలను మాత్రం అయోమయంలో పాడేయడంలో చంద్రబాబు సక్సెస్ అయ్యారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

రాజకీయ స్వార్థం కోసమే



కూటమి నేతలు తమ రాజకీయ స్వార్థం కోసం కలియుగ దైవమైన వెంకటేశ్వరస్వామినే ఫణంగా పెట్టి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని అత్యంత భక్తితో రుచిచూసే భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఆధారాలు లేని ఆరోపణలు చేయడం దుర్మార్గం. ప్రపంచ వ్యాప్తంగా భక్తులంతా జరిగిన పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్నారు.

– వడ్లూరి సీతారాం, తణుకు

భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి



తిరుపతి వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం విషయంలో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. రాజకీయం కోసం శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీయడం ప్రతి హిందూ మనస్సు తట్టుకోలేకపోతోంది. సుప్రీం కోర్టు వ్యాఖ్యలు ప్రతి హిందువుని ఆలోచనలో పడేసాయి. ఈ వ్యవహారంపై పూర్తిగా విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాలి. స్వార్థ రాజకీయం కోసం భగవంతుడిని వాడద్దు.

– జల్లూరి జగదీష్, వ్యాపారి, తణుకు

సీబీఐ విచారణ చేపట్టాలి



తిరుపతి వెంకటేశ్వరస్వామిశ్రీవేంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదం కల్తీ వ్యవహారం భక్తుల్లో తీవ్ర కలకలం రేపింది. దేవస్థానం ఈవో చెప్పిన దానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన దానికి సంబంధం లేదు. తక్షణమే కేంద్రం జోక్యం చేసుకుని సీబీఐ విచారణ చేపట్టి నిజానిజాలు భక్తులకు తెలియజేయాలి. నిరాధార ఆరోపణలు చేసి భక్తులను అయోమయంలోకి నెట్టడం దారుణం.

– పెన్మెత్స రామరాజు, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు

కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేయాలి

తణుకు టౌన్: సంక్షేమ బోర్డులో గుర్తింపు కార్డు పొందిన ప్రతి భవన నిర్మాణ కార్మికునికి సంక్షేమ పథకాలు అందజేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు బళ్ల చిన వీర భద్రరావు కోరారు. మంగళవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని పార్వతీ దేవి ఆలయ ప్రాంగణంలో జరిగిన భవన నిర్మాణ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి వాటాల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా భవన నిర్మాణ కార్మికులకు కార్మిక శాఖ ద్వారా అందించిన గుర్తింపు కార్డులను అందజేశారు. వీరవల్లి వెంకన్న, టీ వెంకటేశ్వరరావు, దున్నే రుద్ర నాగేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, యాతం పెద్దిరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

తణుకు టౌన్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం ఏడుకొండలు చెప్పారు. మంగళవారం సాయంత్రం తణుకు పైడిపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన పిల్లలకు చిన్నప్పటి నుంచి మంచి అలవాట్లను నేర్పిస్తూ వారి నడవడిక పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పట్ల, పెద్దల పట్ల ఎలా మెలగాలో నేర్పించాలని కోరారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే కష్టపడి చదువుకోవాలని కోరారు. పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి, రామలక్ష్మీ, స్వరూప రాణి, యేసు కృప, రామకృష్ణ, జయరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల ప్రారంభం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ టాలెంట్ టెస్ట్ (చెకుముకి) నిర్వహించారు. 14 పాఠశాలల నుంచి 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రూరల్ విభాగం నుంచి కొమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీం సభ్యులు బి.మణికంఠ, పి.రాజేష్, కె.దుర్గాభావానీ, పట్టణ విభాగం నుంచి భాష్యం స్కూల్ ఆర్.నిహార్, ఎం.నిహాంత్, పి.సిరి చందన, ఈవీఎం స్కూల్ నుంచి ఎ.యశ్వంత్, సీహెచ్ చరణ్‌లు విజేతలుగా నిలిచారు. విజేతలను స్కూల్ హెచ్ఎం ఎం.సత్యనారాయణ, సీహెచ్ సత్యనారాయణ, పరీక్ష కన్వీనర్ సీహెచ్‌బీ రవి కుమార్, తదితరులు అభినందించారు. అలాగే పెంటపాడు మండల స్థాయిలో పోటీలు ప్రభుత్వ పోస్ట్ బేసిక్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. అలంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎ.ఝాన్సీ, పి.మేఘన, ఎం.కృషి వర్ధన్‌లు విజేతలుగా నిలిచారు. ఎంఈఓ టీవీ రామకృష్ణ, పాఠశాల హెచ్ఎం ఎస్.రాజేష్, జేవీవీ సభ్యులు ప్రత్తి వీరాస్వామి, సైన్స్ ఉపాధ్యాయిని జి.మాధవిలు అభినందించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పట్టణంలో ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలో మంగళవారం వీకర్స్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో 1, 2 వార్డులలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలు జరిగాయి. దోమ లార్వాలు ఏ విధంగాను, ఎక్కడ వృద్ధి చెందుతాయి, వాటిని ఎలా నివారించవచ్చు తదితర అంశాలపై అవగాహన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాలలోను, ఖాళీ స్థలాల పరిసరాలల్లో నీటి నిల్వలు ఉంచరాదని చెప్పారు. వారానికి ఒక్కసారి డ్రై డే పాటించాలన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధులు వల్ల అనారోగ్య సమస్యలకు గురి అవుతారని, దోమలను అరికట్టాలని, వాటిపట్ల అప్రమత్తతో ఉండాలని పలు ఆరోగ్య సూత్రాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కె.మంగతాయరు, వార్డు కార్యదర్శులు జయమేరీ, లలిత, ఆశాలు దుర్గా, భవాని, సహాయకులు కాంతారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి విద్యను అభ్యసించాలి


తణుకులో మెడిసిన్ సీటు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం పద్మావతి

తణుకు అర్బన్: ఏకాగ్రతతో మంచి విద్యను అభ్యసిస్తే ఆ ఫలితం ఉన్నత శిఖరాలను చేరుస్తుందని తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు పూర్వ విద్యార్థులు టి.గుణశేఖర్, సీహెచ్ సాహితి నిరూపించారని పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి అన్నారు. ఆల్ ఇండియా నీట్ ఎగ్జామ్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన వీరిద్దరికి మంగళవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ సాహితి పాండిచ్చేరిలోని జిప్‌మెర్ మెడికల్ కళాశాలలోను, గుణశేఖర్ గుంటూరు మెడికల్ కళాశాలలోను సీటు సాధించారని వారిద్దరిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యార్థి దశలో కష్టపడితే భవిష్యత్తు బంగారుబాటగా మారుతుందని అన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. స్కూలు స్టాఫ్ సెక్రటరీ ప్రభువరం, మాధవీలత, పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు సీఎంగా కొనసాగే అర్హత లేదు

తాడేపల్లిగూడెం (టీఓసీ): హిందూ భక్తుల మనోభావాలను రెచ్చగొట్టి వారి యొక్క విశ్వాసాలపై అనుమానాలు కలిగించిన సీఎం చంద్రబాబు వైఎస్సార్ సీపీ నాయకుడు నౌషాద్ మొహిద్దీన్ పేర్కొన్నారు. తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందన్న కేసుపై సుప్రీం కోర్టు విచారణ జరిపి ఏపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పట్టిందన్నారు. బాధ్యత గల రాజ్యాంగ పదవి ఉన్న చంద్రబాబు తప్పు చేశారని సుప్రీంకోర్టు చెప్పడం ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు నైతిక పతనం అన్నారు. భక్తుల మనోభావాలతో ఆడుకున్న చంద్రబాబు వెంటనే రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సీనియర్ సిటిజన్స్ దినోత్సవం


కోటి వీరారావును సత్కరిస్తున్న మానవత

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీనియర్ సిటిజన్స్ దినోత్సవం సందర్భంగా పెన్షనర్స్ భవనంలో మానవత ఆధ్వర్యంలో మంగళవారం సీనియర్ సిటిజన్ కోటి వీరారావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత పట్టణ అధ్యక్షుడు పచ్చ వెంకటేశ్వరరావు, సెక్రటరీ ఆంజనేయస్వామి, కోశాధికారి యెగ్గిన శరత్‌బాబు, రాజేంద్ర, హరికుమార్, ముస్తాఫా, బాలకృష్ణ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తగదు


తణుకులో నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

తణుకు: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటుపరం కాకుండా కాపాడుకోవాల్సిన కోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బొద్దాని నాగరాజు అన్నారు. మంగళవారం తణుకు నరేంద్ర సెంటర్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ నల్ల రిబ్బన్లు, ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను సెయిల్‌లో విలీనం చేయాలని, గనులు కేటాయించాలని, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు, ప్రతాప్‌లు మాట్లాడుతూ విశాఖ ఉక్కు స్థాపన కోసం 32 మంది ప్రాణత్యాగం చేశారాని గుర్తు చేశారు. ఏపీలో ఏకైక భారీ పరిశ్రమను మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. మోదీ మిత్రులైన అంబాని, ఆదానిలకు దేశ సంపద దోచుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారని అన్నారు.కూటమి నేతలు తిరుపతి లడ్డుపై స్పందించినట్టుగా విశాఖ ఉక్కు, పెరుగుతున్న ధరలుపై ఎందుకు స్పందించడంలేదని విమర్శించారు. విశాఖ ఉక్కు జోలికి వస్తే ఆందోళన ఉధృతం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ–ఏఐటీయూసీ నాయకులు బొద్దాని మురళి, బి.కిశోర్, ఎస్.రాధాకృష్ణ, ఎస్.ఆదినారాయణబాబు, గుబ్బల గోపి, పి.దక్షిణా మూర్తి, గార రంగారావు, కె.అయ్యప్ప, వల్లూరి వెంకటేశ్వర రావు, సీహెచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో కూటమి ప్రభుత్వం విఫలం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులైన ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నేటికి నెరవేర్చలేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఎద్దేవా చేశారు. పట్టణంలో జరిగిన సమావేశంలో మంగరాజు తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు అమ్మఒడి స్కూల్‌కు ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమంది ఆడపిల్లలకు ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని, నిరుద్యోగ భృతి రూ. 3 వేలు, ఇలా సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారని, ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారని, నేడు అవన్ని నెరవేర్చకుండా తుంగలోకి తొక్కారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జైపాల్, శరత్‌బాబు, ప్రసాద్, సునీల్ కుమార్, అచ్చిబాబు, మురళీ, వెంకన్నబాబు పాల్గొన్నారు.

భవిత సెంటర్‌లో దసరా మహోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత సెంటర్‌లో ముందస్తు దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులచే అమ్మోరు తల్లి వేషధారణలు ధరించి, నృత్యప్రదర్శనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వర య్య, ఎం.చంద్రకుమారి, హెచ్ఎం బి.జ్యోతి, కు మారి, సత్యవతి, నాగలక్ష్మి, రత్నకుమారి, దివ్యాంగులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


వ్యాసరచన పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇరగవరం: మండలంలోని కె.ఇల్లిందలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని గూనా గౌరిదానేశ్వరి భీమవరంలో పీఎస్ఎం బాలికల పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో స్వర్ణాంధ్ర 2047 జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినితోపాటు గైడ్ ఉపాధ్యాయులు రత్నంను తణుకు ఉప విద్యాశాఖ అధికారి డి.మురళీసత్యనారాయణ, మండల విద్యాశాఖ అధికారి ఎస్.శ్రీనివాస్, జి.సత్యప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుత్తుల కిశోర్, గ్రామ సర్పంచ్ మట్టా నాగమణి, ఎంపీటీసీ సభ్యులు పిల్లి కాంతకుమారి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వీరవల్లి లీలాకుమారి, గ్రామ పెద్దలు అభినందించి రాష్ట్ర స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయేతర సిబ్బందికి సన్మానం


బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయేతర సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

అత్తిలి: పాఠశాల ఉపాధ్యాయేతర సిబ్బంది, వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసి, పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయేతర సిబ్బందిగా పనిచేసి బదిలీపై వెళుతున్న వారికి వీడ్కోలు సభ మంగళవారం నిర్వహించారు. పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన బిఆర్ఎస్ హర్షద్, రికార్డు సహాయకుడు ఎస్ మాధవరావు, లైబ్రరీ సహాయకుడు సీహెచ్ శ్రీనుబాబులను పాఠశాల తరపున ఉపాధ్యాయులు సన్మానించారు. వీరిస్థానంలో కొత్తగా వచ్చే సిబ్బంది కూడా అంకితభావంతో పనిచేయాలని హెచ్ఎం కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ప్రగడ శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎస్ పురుషోత్తం, ఎన్ సుజాతదేవి, స్టాఫ్ కార్యదర్శి జి శ్రీనివాస్, రాంబాబు, ఆత్మలింగం, డీఎంజీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

తాడేపల్లిగూడెం: రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని పలువురు వక్తలు తెలిపారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం పురస్కరించుకొని స్థానిక శశి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఏలూరులోని ప్రభుత్వ రక్తబ్యాంకు సహకారంతో మంగళవారం ఇక్కడ రక్తదానం చేశారు. రక్తదానం చేయడం ద్వారా అవసరమైన వారికి ప్రాణదానం చేయవచ్చని బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ అన్నారు. మెడికల్ ఆఫీసర్ జి.రమ్యశృతి రక్తదానం ఆవశ్యకత గురించి వివరించారు. విద్యార్థులు సమాజంలో మంచి ప్రభావం చూపించాలని ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి సల్మాన్ భాషా, బ్లడ్‌బ్యాంకు కో ఆర్డినేటర్ జయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

'లాల్ బహదూర్ శాస్త్రి'పై విద్యార్థులకు పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లాల్ బహదూర్ శాస్త్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో లాల్ బహదూర్ శాస్త్రి జీవిత చరిత్రపై టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విజేతలకు ప్రథమ జ్యోత్స్నకు రూ 2,000, రెండో బహుమతి ఆదిత్యకు రూ 1500, మూడోవ బహుమతి యాదిదత్యకు రూ. 1000 రూపాయిలు అందజేశారు. పాబోలు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అంతేగాక ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. 600 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. కార్యదర్శి బచ్చు విశ్వనాథం, కోశాధికారి కసిరెడ్డి శ్యాంబాబు, పచ్చిపులుసు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.